క్లుప్తంగా

కనకమహాలక్ష్మికి అష్టదళ పద్మారాధన



అష్టదళ పద్మారాధనలో సిరులతల్లి

డాబాగార్డెన్స్ : బురుజుపేటలో వెలసిన కనకమహాలక్ష్మి దేవస్థానంలో మంగళవారం 108 స్వర్ణపుష్పాలతో అష్టదళ పద్మారాధన నిర్వహించారు. ఉదయం 7 నుంచి 8 గంటల వరకు నిర్వహించిన ఈ పూజలో పలువురు ఉభయదాతలు పాల్గొన్నారు. కార్యక్రమంలో ఆలయ ఈవో కె. శిరీష, ధర్మకర్తల మండలి చైర్‌పర్సన్ కొల్లి సింహాచలం, ఏఈవో కె.తిరుమలేశ్వరరావు, సిబ్బంది పాల్గొన్నారు.

16న సహస్ర తులసిపూజ

కనకమహాలక్ష్మి దేవస్థానంలో ఈ నెల 16న సహస్ర తులసిపూజ నిర్వహించనున్నామని ఈవో కె. శిరీష తెలిపారు. ఈ ప్రత్యేక పూజలో పాల్గొనదలిచే భక్తు లు పూజా రుసుం రూ.1500 చెల్లించి దంపతులు ఈ పూజలో పాల్గొనవచ్చని ఈవో పేర్కొన్నారు.

నిందితులను కఠినంగా శిక్షించాలి

సీతమ్మధార : చింతగట్ల గ్రామ సర్పంచ్, అయ్యారక కార్పొరేషన్ డైరెక్టర్ గనిశెట్టి కనకరాజుపై దాడిని తీవ్రంగా ఖండిస్తున్నామని అయ్యారక సంఘం ఓ ప్రకటనలో పేర్కొంది. ప్రభుత్వం, పోలీసులు ఇలాంటి ఘటనలు జరగకుండా నిందితులపై కఠిన చర్యలు తీసుకోవాలని అయ్యారక కార్పొరేషన్ జాతీయ ప్రధాన కార్యదర్శి డాక్టర్. రాజశేఖర్, అయ్యారక కార్పొరేషన్ డైరెక్టర్, రాష్ట్ర అధ్యక్షుడు తెంక రామన్నపాత్రుడు, కర్రి శ్రీను, వరహాలు, బెహరా త్రినాథస్వామి, లంక శ్రీను పాల్గొన్నారు.

అన్ని అవయవాలపై ప్రభావం చూపే మధుమేహం



షుగర్ వ్యాధి గురించి వివరిస్తున్న ఐఎంఏ జిల్లా కార్యదర్శి డాక్టర్ మురళీమోహన్

మహారాణిపేట : మధుమేహం అన్ని అవయవాలపై తీవ్ర ప్రభావం చూపుతుందని ఇండియన్ మెడికల్ అసోసియేషన్ జిల్లా కార్యదర్శి డాక్టర్ ఎంవీవీ మురళీమోహన్ అన్నారు. మంగళవారం జాలారిపేట అర్బన్ హెల్త్ ట్రైనింగ్ సెంటర్‌లో ప్రపంచ మధుమేహ దినోత్సవాన్ని పురస్కరించుకుని ఏర్పాటు చేసిన కార్యక్రమంలో పాల్గొని ప్రసంగించారు. తరచూ మూత్ర విసర్జన, అధిక దాహం, విపరీతమైన ఆకలి, బలహీనత, అలసట, నొప్పులు, మసకబారిన చూపు, దురదలు వంటి లక్షణాలు ఎక్కువగా ఉంటాయన్నారు. ఎక్కువగా ఫైబర్ ఆహారం తీసుకోవడం, ఆహార నియమాలు పాటించడం, క్రమం తప్పకుండా వ్యాయామం చేయడం వంటి వాటి ద్వారా కొంత వరకు మధుమేహాన్ని నివారించడానికి వీలు కలుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో పలువురు వైద్యులు పాల్గొన్నారు.

సీఎం జగన్‌తోనే సంక్షేమం

- ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్‌కుమార్
- 30వ వార్డు తాడి వీధిలో ఆంధ్రప్రదేశ్‌కు జగనే ఎందుకు కావాలంటే కార్యక్రమం



సంక్షేమ పథకాల బోర్డును ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్ కుమార్

మహారాణిపేట : ప్రజలకు సంక్షేమం, అభివృద్ధి అందిస్తూ సుపరిపాలన సాగిస్తున్న జగన్‌మోహన్ రెడ్డి దేశానికే ఆదర్శవంతమైన ముఖ్యమంత్రిగా నిలిచారని ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్‌కుమార్ అన్నారు. మంగళవారం 30వ వార్డు తాడి వీధి సచివాలయంలో నిర్వహించిన ఆంధ్రప్రదేశ్‌కు జగనే ఎందుకు కావాలంటే కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ముందుగా సంక్షేమ పథకాల బోర్డును ఆయన ఆవిష్కరించారు. అనంతరం తాడి వీధి కమ్యూనిటీ హాలు ఆవరణలో జెండా ఆవిష్కరణ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీఎం జగన్ నాలుగేళ్ల పాలనలో చేపట్టిన సంక్షేమం, అభివృద్ధి గురించి వివరించారు. 30వ వార్డు తాడి వీధి సచివాలయం పరిధిలో ప్రత్యక్ష నగదు బదిలీ (డీబీటీ) మొత్తం రూ.10 కోట్ల 77 లక్షలు, పరోక్ష ప్రయోజనాలు (నాన్ డీబీటీ) రూ.10 కోట్ల 57 లక్షలు వెరసి మొత్తం రూ.21 కోట్ల 34 లక్షలు అర్హులైన అక్క చెల్లెమ్మలు, అన్నదమ్ములు, అవ్వాతాతలకు పారదర్శకంగా, ఎలాంటి వివక్షకు తావు లేకుండా లబ్ధి చేకూర్చారన్నారు. గత ప్రభుత్వ పాలనకు, నేటి జగనన్న సుపరిపాలనకు గల వ్యత్యాసాన్ని గమనించాలన్నారు. పేదలకు సంక్షేమ ఫలాలు అందించాలనే ఉద్దేశంతో ప్రభుత్వం ఎన్నో వినూత్న కార్యక్రమాలు చేపడుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో 30వ వార్డు కార్పొరేటర్ కోడూరు అప్పలరత్నం, మండల పార్టీ అధ్యక్షుడు పీతల వాసు, క్లస్టర్ ఇన్‌చార్జి కోన శంకర్, వార్డు ప్రెసిడెంట్ దశమంతుల మాణిక్యాలరావు, శ్రీ ఆంజనేయస్వామి ఆలయ ధర్మకర్తల మండలి చైర్మన్ వద్దాది దిలీప్, వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకులు పెంటపల్లి సత్యనారాయణ, దశమంతుల చిన్ని, ఆనంద్, శ్యామ్, వెంకట్, ఎర్రబిల్లి ప్రభాకరరావు, రామలక్ష్మి, జగన్, వేణుగోపాల్, కల్యాణి, రాము, మణి, మీనా, మంజు, కోరాడ సురేష్, సంతోష్, బాలు, రామరాజు, జీవీఎంసీ జోన్–4 జోనల్ కమిషనర్ శివప్రసాద్, ఈఈ సంతోషికుమారి, ఏసీపీ వినయ్‌ప్రసాద్, ఏపీడీ పుణ్యవతి, సచివాలయ సిబ్బంది, సీవోలు, ఆర్‌పీలు హాజరయ్యారు.

న్యుమోనియాపై అవగాహన అవసరం



పోస్టర్ విడుదల చేస్తున్న డీఎంహెచ్‌వో జగదీశ్వరరావు, పలువురు వైద్యులు

మహారాణిపేట: పిల్లల్లో వచ్చే న్యుమోనియా లక్షణాలపై అవగాహన అవసరమని డీఎంహెచ్‌వో డాక్టర్ పి.జగదీశ్వరరావు తెలిపారు. మంగళవారం రేసపువానిపాలెంలోని డీఎంహెచ్‌వో కార్యాలయంలో న్యూమోనియా లక్షణాలపై పోస్టర్ ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా డీఎంహెచ్‌వో మాట్లాడుతూ ఈ నెల 12 నుంచి వచ్చే ఫిబ్రవరి 28వ తేదీ వరకు ప్రతి ఆరోగ్య కేంద్రంలో అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు. ఎక్కువ సార్లు శ్వాస తీసుకోవడం, నీరు తాగలేకపోవడం, ఆహారం తినలేకపోవడం, శ్వాస తీసుకొనే సమయంలో గురక రావడం, నీరసంగా, మత్తుగా ఉండడం వంటి లక్షణాలు కనిపిస్తే పిల్లలను వెంటనే ఆరోగ్య కేంద్రానికి తీసుకెళ్లి చికిత్స అందించాలన్నారు. ఈ సమావేశంలో ప్రోగ్రాం అధికారి డాక్టర్ రమాదేవి, జిల్లా వ్యాధి నిరోధక టీకాల అధికారి డాక్టర్ ఎస్.జీవనరాణి, నోడల్ అధికారి డాక్టర్ బి.ఉమావతి, జిల్లా మీడియా విస్తరణ అధికారి(డిమో) బి.నాగేశ్వరరావు, పలు ప్రోగ్రాం అధికారులు డాక్టర్ జగదీష్‌ప్రసాద్, మనోరమ, బి.నాగభూషణం పాల్గొన్నారు.

డీఆర్‌ఎం ఆకస్మిక తనిఖీలు

తాటిచెట్లపాలెం : వాల్తేర్ డివిజన్, డివిజనల్ రైల్వే మేనేజర్ సౌరభ్ ప్రసాద్ డివిజన్ పరిధిలోని పలు రైల్వేస్టేషన్‌లలో మంగళవారం ప్రత్యేక భద్రతా తనిఖీలను నిర్వహించారు. ప్రత్యేకంగా కంటకాపల్లి–అలమండ సెక్షన్‌లో కీలక ప్రాంతాలలో ప్యానల్ రూంలను, రిలే రూంలను, ఇంటర్‌లాకింగ్ సిస్టంలను, అగ్ని ప్రమాద భద్రతా ప్రమాణాలను పరిశీలించారు. ఈ సెక్షన్‌లో ఇటీవల ప్రమాదానికి గురైన స్థలాన్ని పరిశీలించారు. ఇవే కాకుండా కొత్తవలస, పెందుర్తి, తిలారు, కోరుకొండ స్టేషన్‌లలో కూడా డిఆర్‌ఎం తనిఖీలు చేపట్టారు. ఈ పర్యటనలో డీఆర్‌ఎంతో పాటు ఏడీఆర్‌ఎం(ఆపరేషన్స్)మనోజ్‌కుమార్ సాహూ, సీనియర్ డివిజనల్ భద్రతా అధికారులు, సీనియర్ డివిజనల్ ఇంజినీర్ (కోఆర్డినేషన్) సీనియర్ డివిజనల్ ఆపరేషన్స్ మేనేజర్, సీనియర్ డివిజనల్ సిగ్నల్ అండ్ టెలికం ఇంజినీర్, సీనియర్ డివిజనల్ కమర్షియల్ మేనేజర్, సీనియర్ డివిజనల్ ఎలక్ట్రికల్ ఇంజినీర్లు పాల్గొన్నారు.

సీపీఐ దీక్షను విజయవంతం చేయాలి

అల్లిపురం : కృష్ణా జలాల పునః పంపిణీపై కేంద్ర ప్రభుత్వం విడుదల చేసిన గెజిట్ నోటిఫికేషన్ రద్దు చేయాలని, రాష్ట్రంలో కరువు పీడిత ప్రాంతాలను తక్షణమే ప్రకటించాలని, యుద్ధ ప్రాతిపదికన సహాయ చర్యలు చేపట్టాలని సీపీఐ విశాఖ జిల్లా కార్యదర్శి మరుపల్లి పైడిరాజు డిమాండ్ చేశారు. ఈ మేరకు విజయవాడలో నవంబర్ 20,21 తేదీల్లో సీపీఐ ఆధ్వర్యంలో చేపట్టిన 30 గంటల నిరసన దీక్షను విజయవంతం చేయాలని కోరుతూ ముద్రించిన పోస్టర్‌ను ఆయన ఆవిష్కరించారు. మంగళవారం అల్లిపురం సీపీఐ కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మిగులు జలాలపై సుప్రీం కోర్టులో కేసు నడుస్తుండగా మోదీ ప్రభుత్వం కృష్ణా జలాలపై నోటిఫికేషన్ విడుదల చేయడం దారుణమన్నారు. తెలంగాణ ఎన్నికల్లో లబ్ధి పొందేందుకే బీజేపీ రాయలసీమ ప్రయోజనాలను పణంగా పెట్టి కుట్రపూరితంగా నోటిఫికేషన్ విడుదల చేసిందని విమర్శించారు. కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు ఎ.విమల, కె.సత్యాంజనేయ, అచ్యుతరావు, జి.రాంబాబు, ఆర్.శ్రీనివాసరావు, ఎం.మన్మథరావు తదితరులు పాల్గొన్నారు.

వేడుకగా ఆకాశ దీప దర్శనం



ఆకాశ దీప కార్యక్రమంలో పాల్గొన్న



విశేష అలంకరణలో చంద్రమౌళీశ్వర స్వామి

అల్లిపురం : కార్తీక మాసం ప్రారంభం సందర్భంగా టూటౌన్ దరి శ్రీ శివరామకృష్ణ దేవస్థానంలో మంగళవారం సాయంత్రం ఆకాశదీప దర్శనాన్ని వేడుకగా నిర్వహించారు. ఉదయం నుంచి ఆలయ అర్చకుడు భార్గవశర్మ ఆధ్వర్యంలో చంద్రమౌళీశ్వర స్వామికి విశేష పంచామృతాభిషేకాలు, అర్చనలు నిర్వహించారు. సాయంత్రం దేవాలయ ఆవరణలో ఆకాశ దీప దర్శనం పూజా కార్యక్రమాలు చేపట్టారు. ఈ కార్యక్రమంలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని ఆకాశ దీపాలు వెలిగించి తరించారు.

రైల్వే స్టేషన్‌లో 40 కిలోల గంజాయి స్వాధీనం

తాటిచెట్లపాలెం : గంజాయి రవాణా చేస్తున్న ఇద్దర్ని జీఆర్పీ సిబ్బంది అరెస్టు చేశారు. విశాఖ రైల్వే స్టేషన్‌లో ఎస్‌ఐ జి.శ్రీనివాసరావు, జీఆర్పీ, ఆర్పీఎఫ్ సిబ్బందితో ప్లాట్‌ఫారాలను తనిఖీలు నిర్వహించారు. హర్యానాకు చెందిన కిషన్, సంజయ్ బ్యాగులను తనిఖీ చేయగా 40 కేజీల గంజాయిని పట్టుబడింది. వీరు ఒడిశాలోని మలకన్‌గిరి నుంచి హర్యానాకు గంజాయి తరలిస్తున్నట్టు ప్రాథమిక విచారణలో తేలింది.

వీరిని అరెస్టు చేసి కోర్టులో హాజరుపరిచారు. డిప్యూటీ సూపరింటెండెంట్ ఆఫ్ రైల్వే పోలీసు (డీఎస్‌ఆర్పీ) బి.మోహనరావు ఆదేశాలతో నిత్యం తనిఖీలు నిర్వహిస్తున్నామని శ్రీనివాసరావు తెలిపారు.

ఘనంగా గోవర్ధన పూజ

కంచరపాలెం: స్థానిక గొల్లకంచరపాలెం పరిధిలోని కోదండ సీతారామ స్వామి, సంపత్ వేంకటేశ్వర స్వామి, దుర్గా ధనలక్ష్మీదేవి ఆలయాల్లో మంగళవారం కార్తీక మాసాన్ని పురస్కరించుకుని గోవర్ధన పూజలను ఘనంగా నిర్వహించారు. ముందుగా దేవతా మూర్తులను విశేషంగా అలంకరించారు. అనంతరం గోమాత ప్రదక్షిణ, విశేష హారతి నిర్వహించారు. ఆలయాల ప్రధాన అర్చకులు సుబ్రహ్మణ్యశర్మ, శ్యామ్‌శర్మలు గోమాతకు పూజలు చేశారు. శ్రీరామా సేవా సమాజం (యాదవ్) అధ్యక్షుడు పల్లా సత్యనారాయణ నేతృత్వంలో ఆలయ కమిటీ సభ్యులు భక్తులు ప్రసాద వితరణ చేశారు. కార్యక్రమంలో గ్రామ పెద్దలు, కమిటీ సభ్యులు, అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

ప్రజాదర్బార్, డయల్ యువర్ ఎమ్మెల్యేకు ఆదరణ



లక్ష్మీ టాకీస్ వద్ద ప్రజల నుంచి వినతులు స్వీకరిస్తున్న ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్‌కుమార్

జగదాంబ : సమస్యల పరిష్కారమే ధ్యేయంగా నిర్వహిస్తున్న ప్రజాదర్బార్, డయల్ యువర్ ఎమ్మెల్యే కార్యక్రమాలకు చక్కటి ఆదరణ లభిస్తోందని ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్‌కుమార్ అన్నారు. మంగళవారం జీవీఎంసీ 39వ వార్డు లక్ష్మీ టాకీస్ వద్ద నిర్వహించిన ప్రజాదర్బార్‌లో ఆయన ప్రజల నుండి వినతులు స్వీకరించారు. అనారోగ్యంతో బాధపడుతున్న వారిని ఓదార్చి, వారికి సాయమందించడం సంతృప్తిని ఇస్తుందన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ద్వారా సాయం పొందిన పలువురు ఆయనకు కృతజ్ఞతలు తెలిపారు. పలువురు కొత్తగా పెన్షన్లు, రేషన్ కార్డులు కావాలని కోరగా సంబంధిత అధికారులతో ఎమ్మెల్యే మాట్లాడారు. ఈ కార్యక్రమంలో కనకమహాలక్ష్మి దేవస్థానం ధర్మకర్తల మండలి చైర్‌పర్సన్ కొల్లి సింహాచలం, సౌత్ మైనార్టీ సెల్ ప్రెసిడెంట్ ముజీబ్‌ఖాన్, సిటీ సెక్రటరీ ఆదివిష్ణు, ఖాజావలి, వైఎస్సార్‌సీపీ స్టేట్ నాయకులు మాదాబత్తుల రమేష్, జిల్లా సీనియర్ నాయకులు సలీం, ఎర్రబిల్లి ప్రభాకర్, శ్యామ్, ఆది, సురేష్, వివిధ కార్పొరేషన్ల డైరెక్టర్లు, వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

కేజీహెచ్ సేవలు భేష్



పాడేరుకు చెందిన రోగులను పరామర్శిస్తున్న మాజీ మంత్రి బాలరాజు



కేజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ అశోక్‌కుమార్, డాక్టర్ రాంబాబులను సన్మానిస్తున్న మాజీ మంత్రి బాలరాజు, మాజీ ఎమ్మెల్యే రెహ్మాన్

మహారాణిపేట : ఉత్తరాంధ్రతో పాటు ఒడిశాకు పెద్ద దిక్కుగా ఉన్న కేజీహెచ్‌ను ప్రభుత్వం పూర్తి స్థాయిలో అభివృద్ధి చేసి రోగులకు మెరుగైన వైద్య సేవలందిస్తోందని వైఎస్సార్‌సీపీ నాయకుడు, మాజీ మంత్రి పి.బాలరాజు అన్నారు. మాజీ ఎమ్మెల్యే డాక్టర్ ఎస్.ఎ.రెహ్మాన్‌తో కలిసి ఆయన మంగళవారం కేజీహెచ్‌ను సందర్శించారు. కేజీహెచ్‌లో చికిత్స పొందుతున్న పాడేరుకు చెందిన పలువురు రోగులను వారు పరామర్శించారు. అనంతరం కేజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ పి.అశోక్‌కుమార్, డాక్టర్ రాంబాబులను శాలువాలు కప్పి సన్మానించారు. రోగులకు అందిస్తున్న సేవల పట్ల బాలరాజు సంతోషం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా కేజీహెచ్‌లో కల్పించిన సదుపాయాల పట్ల బాలరాజు, డాక్టర్ రెహ్మాన్ సంతృప్తి వ్యక్తం చేసి సీఎం జగన్‌మోహన్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. వైద్యులు తదితరులు పాల్గొన్నారు.

రెండు ప్రాణాలు కాపాడిన కోత లేని టవర్ వైద్యం



మాట్లాడుతున్న డాక్టర్ హరివదన్, డాక్టర్ సుజాత

మహారాణిపేట : గుండె బృహద్ధమనికి సంబంధించిన అరుదైన ప్రాణాంతక వ్యాధితో బాధపడుతున్న ఇద్దరు రోగులకు శస్త్ర చికిత్స, కోత లేని టవర్ వైద్య విధానం ఎండోవాస్కులర్ డివైస్‌ను విజయవంతంగా గుండెలో అమర్చి వారి ప్రాణాలు కాపాడినట్టు ఇండస్ ఆస్పత్రి కార్డియో థొరాసిక్ వాస్కులర్ సర్జన్ డాక్టర్ హరివదన్ లుక్కా, డాక్టర్ సుజాత తెలిపారు. మంగళవారం నగరంలో ఒక హోటల్లో నిర్వహించిన సమావేశంలో డాక్టర్ హరివదన్ లుక్కా మాట్లాడుతూ అనకాపల్లి జిల్లాకు చెందిన 38 ఏళ్ల వ్యక్తి ప్రాణాంతకమైన వ్యాధితో బాధపడుతూ తమ ఆస్పత్రికి వచ్చారని, అతనికి విజయవంతంగా శస్త్ర చికిత్స నిర్వహించామన్నారు. 21 ఏళ్ల యువకుడికి మూడు సార్లు గుండె నొప్పి వచ్చిందని, అత్యవసర చికిత్స ద్వారా కోత లేని టవర్ ఏర్పాటు చేసి ప్రాణాలు కాపాడినట్టు వివరించారు. బృహద్ధమని ఉబ్బడం, పగిలిపోవడం, చిట్లడం, చీలిక వంటివి ప్రాణాపాయ స్థితికి దారి తీస్తాయన్నారు. ఈ స్థితిని సకాలంలో గుర్తించకపోతే ప్రాణాలు పోయే అవకాశం ఉందన్నారు. ఈ రెండు కేసుల్లో పోలీసు కమిషనర్ సహకారంతో హైదరాబాద్ నుంచి విశాఖకు సకాలంలో గుండెకు సంబంధించిన పలు పరికరాలు గ్రీన్ చానల్ ద్వారా వచ్చాయన్నారు. ఈ కార్యక్రమంలో ఆస్పత్రి మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ ఎస్.ఎస్.శ్రీధర్, వైద్యులు డాక్టర్ అనిల్‌కుమార్ మహాపాత్రో, డాక్టర్ టి.రాకేష్, డాక్టర్ మాధవ నాయుడు, డాక్టర్ నాగ నరసింహారెడ్డితో కూడిన ఇంటర్వెన్షనల్ కార్డియాలజీ బృందం పాల్గొంది.

యూజర్ చార్జీల వసూలు వేగవంతం కావాలి



సమావేశంలో మాట్లాడుతున్న ఏఎంహెచ్‌వో రాజేష్

జగదాంబ : యూజర్ చార్జీల వసూలు వేగవంతం చేయాలని జీవీఎంసీ జోన్–4 ఏఎంహెచ్‌వో ఎ.రాజేష్ అన్నారు. మంగళవారం జోన్–4 కార్యాలయంలో ఆయన శానిటరీ ఇన్‌స్పెక్టర్లు, పారిశుధ్య కార్యదర్శులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వారంలో రెండు రోజులు బుధవారం, శనివారం స్పెషల్ డ్రైవ్‌లు నిర్వహించి యూజర్ చార్జీలు వసూలు చేయాలన్నారు. ప్రతి ఇంటికి చెత్త సేకరణకు వెళ్లినప్పుడే యూజర్ చార్జీలు కూడా వసూలు చేస్తే పనులు సులభతరం అవుతాయన్నారు. శానిటరీ ఇన్‌స్పెక్టర్‌తో పాటు సెక్రటరీలు కూడా విధిగా పాల్గొని వసూలు చేయాలన్నారు. ఎప్పటికప్పుడు వసూలైన మొత్తం జీవీఎంసీ సౌకర్యం సెంటర్‌లో చెల్లించి రసీదు తీసుకోవాలని సూచించారు. మురికివాడల్లోనే ఎక్కువగా బకాయిలు ఉన్నాయని వాటిని కూడా వసూలు చేసే బాధ్యత ఇన్‌స్పెక్టర్లదే అన్నారు. అదే విధంగా ట్రేడ్ లైసెన్సుల రుసుమును కూడా త్వరితగతిన వసూలు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో శానిటరీ సూపర్ వైజర్ కిశోర్ తదతరులు పాల్గొన్నారు.

బాలల నేస్తం.. చాచా నెహ్రూ



విజేతలకు సర్టిఫికెట్లు అందజేస్తున్న ప్రిన్సిపాల్ శోభారాణి



పిల్లలనుద్దేశించి మాట్లాడుతున్న ఏవీఎన్ కళాశాల ప్రిన్సిపాల్ సింహాద్రినాయుడు



సమావేశంలో పాల్గొన్న విద్యార్థులు



గ్రంథాలయ వారోత్సవాల సందర్భంగా మాట్లాడుతున్న కార్పొరేటర్ భీశెట్టి వసంతలక్ష్మి



నెహ్రూ చిత్రపటం వద్ద నివాళులు అర్పిస్తున్న జహీర్ అహ్మద్

డాబాగార్డెన్స్ : విశాఖ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో గ్రంథాలయ వారోత్సవాలు మంగళవారం ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా బాలల దినోత్సవాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో పాల్గొన్న కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్. శోభారాణి మాట్లాడుతూ విద్యార్థుల్లో గ్రంథాలయాల పట్ల ఆసక్తి, జ్ఞాన సముపార్జన పట్ల ఉత్సాహాన్ని కల్పించడంలో ఇలాంటి కార్యక్రమాలు ఉపయోగపడతాయన్నారు. కార్యక్రమ కో ఆర్డినేటర్, లైబ్రేరియన్ డాక్టర్ ఎ. ధరణి మాట్లాడుతూ వారం రోజుల పాటు వ్యాస రచన, వక్తృత్వం, క్విజ్, పుస్తక ప్రదర్శన, కవితా పఠనం వంటి కార్యక్రమాలు నిర్వహించనున్నట్టు చెప్పారు. కార్యక్రమంలో డాక్టర్ కె. సుధా, డాక్టర్ కల్యాణరాము, ఎస్. అనురాధ, జె. లావణ్య, డాక్టర్ నాగశాంతి, మౌనిక, అధిక సంఖ్యలో విద్యార్థినులు పాల్గొన్నారు.

బాలల శాఖా గ్రంథాలయంలో..

జీవీఎంసీ 36వ వార్డు రంగిరీజువీధిలో గల బాలల శాఖా గ్రంథాలయంలో 56వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాలను ఏవీఎన్ కళాశాల ప్రిన్సిపాల్ ఎం. సింహాద్రినాయుడు, రామచంద్ర పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు సీహెచ్ శ్యామల, 36వ వార్డు సచివాలయ ఎడ్యుకేషన్ సెక్రటరీ సీహెచ్ అనంతలక్ష్మి, కె. రాజేష్ పాల్గొని ప్రారంభించారు. ముందుగా చాచా నెహ్రూ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.



నెహ్రూ చిత్రపటం వద్ద నివాళులు అర్పిస్తున్న డాక్టర్ లక్ష్మీనారాయణ

అనంతరం ఏవీఎన్ కళాశాల ప్రిన్సిపాల్ మాట్లాడుతూ గ్రంథాలయాలను విద్యార్థులు ఉపయోగించుకుంటే విజ్ఞానాన్ని పొందవచ్చని, ప్రతి ఒక్కరూ గ్రంథాలయాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. పాఠశాల అనంతరం ప్రతిరోజూ ఒక గంట గ్రంథాలయానికి వచ్చి పుస్తక పఠనం అలవరచుకోవాలని సూచించారు. గ్రంథాలయాల్లో పోటీ పరీక్షలకు సంబంధించిన మెటీరియల్ ఉంటుందని, వాటిని వినియోగించుకుని పోటీ పరీక్షలకు సన్నద్ధం కావాలన్నారు. ఈ సందర్భంగా పిల్లలకు మ్యూజికల్ చైర్, పద్యాల పోటీ, కథల పోటీలు నిర్వహించారు. గ్రంథాలయ అధికారి టి. పోలితల్లి అధ్యక్షతన నిర్వహించిన ఈ కార్యక్రమంలో ముఖీమ్, వై. పద్మ, ఎస్. నూకరత్నం, ఎన్. ఎల్లారావు, లక్ష్మణరావు తదితరులు పాల్గొన్నారు.

ప్రకృతి చికిత్సాలయంలో..

మహారాణిపేట : బాలల దినోత్సవాన్ని పురస్కరించుకుని శ్రీ గాయిత్రి వెల్ఫేర్ కల్చరల్ యూత్ అకాడమీ, రూపాకుల విశాలక్షి చారిటబుల్ ట్రస్టు నిర్వహణలో మంగళవారం మహారాణిపేటలోని ప్రకృతి చికిత్సాలయంలో చాచా నెహ్రూ జయంతి నిర్వహించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ ఎస్.లక్ష్మీనారాయణ, జాతీయ అవార్డు గ్రహీత రూపాకుల రవికుమార్, డాక్టర్ ఎస్.శ్రీలక్ష్మి, దూడ మైథిలి, క్షీరాబ్ది దుతి, గేదెల శ్రీహరి, శ్రీపతి కనక దుర్గా, గౌరీ శంకర్, మంగ, రమణ, కొండమ్మ, బంగారమ్మ, జి.రాము తదితరులు పాల్గొన్నారు.

అల్లిపురం శాఖా గ్రంథాలయంలో..

అల్లిపురం : విజ్ఞానాన్ని అందించే భాండాగారాలు గ్రంథాలయాలు అని 33వ వార్డు కార్పొరేటర్ భీశెట్టి వసంతలక్ష్మి అన్నారు. అల్లిపురం శాఖా గ్రంథాలయంలో మంగళవారం జరిగిన కార్యక్రమంలో ఆమె ముఖ్య అతిథిగా పాల్గొని 56వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాలను ప్రారంభించారు. ముందుగా ఆమె బాలల దినోత్సవం, నెహ్రూ జన్మదినాలను పురస్కరించుకుని సరస్వతీ దేవికి, చాచా నెహ్రూ చిత్రపటానికి పూలమాలలు వేసి జ్యోతి వెలిగించి వారోత్సవాలను ప్రారంభించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ గ్రంథాలయాల ద్వారా విజ్ఞానాన్ని పెంపొందించుకుని ఉన్నత శిఖరాలకు చేరుకోవాలన్నారు. పుస్తకం స్నేహితుడితో సమానమన్నారు. గ్రంథాలయాధికారి పీవీఎన్ రాజు మాట్లాడుతూ గ్రంథాలయ వారోత్సవాల్లో ప్రతి రోజు చిన్నారులకు పోటీలు నిర్వహించనున్నట్లు తెలిపారు. బాలలు వాటిని వినియోగించుకోవాలని కోరారు. కార్యక్రమంలో పాఠశాల విద్యార్థులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

జగదాంబ : జీవీఎంసీ 39వ వార్డులో ఉన్న వివేకానంద స్వచ్ఛంద సంస్థలో జవహర్‌లాల్ నెహ్రూ జయంతి ఘనంగా నిర్వహించారు. నెహ్రూ చిత్రపటానికి సంస్థ గౌరవ అధ్యక్షుడు డాక్టర్ జహీర్ అహ్మద్ పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భారతదేశ మొట్టమొదటి ప్రధానిగా 17 సంవత్సరాలు పాలన చేశారన్నారు. నవంబర్ 14వ తేదీన పుట్టిన ఆయనకు చిన్న పిల్లలంటే చాలా ఇష్టమని అందుకే ఆయన జయంతిని చిల్డ్రన్స్‌డేగా జరుపుకుంటారన్నారు. అనంతరం విద్యార్థులకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో రౌండ్ టేబుల్ సభ్యులు మక్సూద్ అహ్మద్, సంస్థ అధ్యక్షుడు అప్పారావు, సత్తిబాబు తదితరులు పాల్గొన్నారు.